

# సాంఘిక క్రౌర్యం

వి. రాజారామమోహనరావు

సురేంద్ర వూహించిన దానికన్నా సాత్వికంగా కనిపించాడు అతను. తెల్లగా, అందంగా వున్నాడు. అతని ముఖంలో కానీ, మాట తీరులో కానీ క్రిమినల్ లక్షణాలేం కనిపించటంలేదు సురేంద్రకి.

కానీ అతను నేరం చేశాడు. హీనియస్ క్రైమ్ అని పేపర్లన్నీ రిపోర్టు చేశాయి. రేపో మాపో శిక్షకూడా పడబోతోంది. అన్నిటికన్నా విశేషం– ఏమాత్రం రభసలేకుండా అతను అతని నేరాన్ని మొదటినుంచీ వొప్పుకుంటూనే వున్నాడు.

సురేంద్ర అంతకు ముందే చెప్పాడు. కేవలం ఒక నేరస్థుడిగా అతన్ని చూట్టానికి కానీ, ఆ దృష్టితోటే మాట్లాట్టానికాని రాలేదని. అయినా అతన్ని అలా చూశాక మరోసారి చెప్పాలనిపించింది. గొంతు సరిచేసుకున్నాడు.

"చడండి ఏదో నేను ప్రశ్నలు అడిగే వాడిగా. మీరు బదులు చెప్పే వ్యక్తిగా వొద్దు....బి ఫ్రీ.... అండ్....ఫ్రాంక్.... జరిగిన విషయం మీకు తోచినట్లు మీరే చెప్పితే బావుంటుంది....ముఖ్యంగా మీరు నాకు యీ నేరానికి సంబంధించిన వ్యక్తిగానే కాదు....మొత్తం మీదుగా....సంపూర్తిగా మీరు మీ గురించి కావలి...." అన్నాడు.

"ఓకే....అలాగే...." అన్నాడు అతను నవ్వి.

ఇద్దరూ ఎదురెదురుగాకూచున్నారు. ఇద్దరి మధ్య టేబుల్ వుంది. ఇద్దరూ నెమ్మదిగా

మాట్లాడుకున్నా, గట్టిగా చర్చించుకున్నా యిబ్బంది లేని ఒంటరి హాలు.

"చెప్పండి." అన్నాడు సురేంద్ర సద్దుకూర్చుంటూ.

"అలాగే చెపుతాను. కానీ చెప్పే ముందు నాదో ప్రశ్న. అసలు ఈ విషయంలో మీ నిజమైన యింటరెస్ట్ ఏమిటో సూటిగా చెపుతారా?" అతని ముఖంలో యిందాకటి నవ్వు లేదు. ప్రశ్నలు అడగటం, వాటికి జవాబులు వినటం అలవాటుగా వస్తున్న సురేంద్రని ఆ ప్రశ్న సూటిగా తాకింది. ఫ్రాంక్ అండ్ ఫ్రీ అని అంత వరకు అతని వేపు నుంచే ఆలోచించాడు. ఈ ప్రశ్న సురేంద్రని తన వేపు నుంచి కూడా ఆలోచించమంటోంది.

"ముఖ్యంగా ప్రొఫెషనల్.... ఈ విషయాన్ని అన్ని పత్రికలు న్యూస్‌గానే రిపోర్ట్ చేశాయి. చావులన్నా, ప్రమాదాలన్నా, నేరాలన్నా దిన పత్రికలు చదివే వాళ్ళు ఎక్కువగా రెస్పాండ్ అవుతారు. అదీకాక ఐసెన్స్‌దే స్టోరీ ఇన్ యిట్ ... మీతో స్పష్టంగామాట్లాటం జరిగితే మంచి స్టోరీ అవుతుందన్న నమ్మకం. అందుకే మీగురించి వివరాలు సేకరించాను. వాటికీ ఈ రేప్ కేస్‌కీ. నాకు అంతగా పొంతన కనిపించలేదు దానితో నాలో వృత్తిపరమైన కుతూహలం పెరిగింది. ఇకపోతే నా ఇంటరెస్ట్‌కి రెండోవేపు.... ఈ కేస్ గురించి ఈ దారుణం గురించీ తెలియగానే నేరస్థుడిగా మీమీద చాలా అసహ్యం వేపింది. కేవలంఅసహ్యమే కాదు యింకా బలమైన డిస్ట్రిబెన్స్. ఎందుకిలా జరిగింది. పరస్పరం సంబంధం కనిపించని ఈ నేరం వెనక ఏముందో తెలుసుకోవాలన్న వ్యక్తిగత కుతూహలం" అన్నాడు సురేంద్ర.

ఒకటి రెండు క్షణాలు అతనేం మాట్లాడలేదు. సురేంద్రవేపే చూశాడు. ఆ చూపుకూడా సురేంద్రని కాకుండా అతనిలోకే అతనే చూసుకున్నట్టుంది.

"అయితే వినండి.... ఐ రేప్డ్ హెర్. ఇట్స్ ఫేక్ట్. కానీ ఎప్పుడు. ఏ క్షణాన నాలో ఆ వుద్దేశం కలిగిందో ఖచ్చితంగా నాకేతెలియదు.ఆ క్షణాన అదో ఇంపల్స్-ఓ ఏనిమల్ ఇనిస్టింక్ట్. ఇప్పుడు తలుచుకుంటే నాకే అసహ్యం. ఆ సమయాన. నేను కానిదేదో.... నాది కాంది ఏదోశక్తి ఏమైనా చేసింది నేనే. ఐ డిడ్ యిట్."

"అంటే అంతకు ముందు ఆవిడ...." సురేంద్ర మాట పూర్తి కానివ్వలేదు అతను మధ్యలోనే అందుకుని—


"మీరు వేసే ప్రశ్నలెలాంటివో నాకు తెలుసు ఇంతకు ముందు ఆవిడ మీకు తెలియదా? ఆవిడ మీద వూహలోనేనా మీకు వాంఛ కలగలేదా? ఆవిడ మీదగానీ, ఆవిడ కుటుంబం మీద గానీ మీకు పాతపగ ఏదేనా వుందా? ఈ రకం ప్రశ్నలు ఈ గొడవ జరిగిం తర్వాత నాకు చాలా ఎదురయ్యాయి. జరిగిందాన్ని. నా గత జీవితాన్ని అంతా కలగలిపి చూసుకున్నా నా వరకూ నాకే యింకా చాలా సందేహాలున్నాయి. అందువల్ల మీ ప్రశ్నలు కాక నన్నే చెప్పనివ్వండి.అంతా చెప్పాక యింకా మీకు అడగాలనిపిస్తే అడుగుదురు గాని. ఇలా చెప్పుకుంటూ పోతేనేగా నా కన్ఫ్యూజన్ లోంచి, నా అస్థిమితంలోంచి బైటపడతానేమో."

అతనలా అన్నాక సురేంద్ర యింకేం మాట్లాడలేదు.

"మా యిళ్ళు పక్కపక్కనే. యిద్దరివీ మేడమీద పోర్షన్లే నేనుండేది మేడమీద ఓ చిన్నగది. అందువల్ల నీళ్ళకి, బాత్‌రూమ్ లాంటి అవసరాలకి కిందకి వెళ్ళాల్సివస్తుండేది. నేనుంటున్న మేడ అనుకునే వాళ్ళ మేడ. రెండు గదులు, కిచెన్, వరండా. మంచి వీలుగా వుండే యిల్లు. ఆవిడ, వాళ్ళాయన యిద్దరే వుంటున్నారు. రోజుకి కనీసం నాలుగైదు సార్లేనా కనిపిస్తూండేదిఆవిడ,ఆరోగ్యంగా,అందంగా. ఎప్పుడు చూసినా నీట్‌గా వుండేది. ఆవిడ నడకలో మూవ్‌మెంట్స్‌లో హుందా,కొద్దిపాటి గర్వం. మొత్తానికి ఆవిడది వో ప్రత్యేకమైన స్టైల్. జీవితం పట్ల జీవితం నడుస్తున్న తీరుపట్ల ఎంతో కొంత తృప్తి లేకపోతే ఆవిడలా అలా ధీమాగావుండటం సాధ్యం కాదేమో అనిపిస్తుండేదినాకు.

ఇదంతా ఆవిణ్ని ఏ ఒక్కసారి చూసినప్పుడో కలిగిన అభిప్రాయం కాదు. ఇప్పుడు ఆవిడ గురించి ఆలోచిస్తుంటే, నాలోని అప్పటి భావాలలో కొంత భాగం యిది. ఆవిడ భర్తనీచాలాసార్లు చూశాను. ఏదో ఆఫీసులో సేల్స్ మేనేజర్. ఆవిడకి తగినట్టే చలాకీగా, నీట్‌గా వుండేవాడు. అతని కోసమే చూస్తున్నట్టు సాయంత్రం అతనొచ్చే టైముకి, రోడ్డుని చూస్తూ డాబామీద పచార్లు చేస్తుండేది. ఈవిడ. ఆర్థికంగా యిబ్బందులున్నవాళ్ళలా నాకు వాళ్ళెప్పుడూ కనపళ్ళేదు. అతని చేతిలో ఏవో పేకెట్స్. యింటికొస్తున్నప్పుడు సాధారణంగా కనిపిస్తూనే వుండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళిద్దరి జీవితం, వాళ్ళ సంతోషం అంటే నాకు ఎడ్మిరేషన్. ఎప్పటికేనా నా జీవితం కూడా ఆ స్థాయికి ఎదిగితే చాలు అన్న భావన నాలో అంతర్గతంగా వుండేవి. నేనే కాదు....నాచుట్టూవున్న యూత్ అంతా అలా బతగ్గలిగితే యింకేం కావాలి.... అన్న తియ్యటి కల.

కానీ....సాధ్యం కాదని తెలుసు. నా వరకు నా పరిస్థితేమిటో నాకు తెలియంది కాదు; సైన్సు గ్రాడ్యుయేట్‌గా ఎంప్లాయి



మెంట్ ఎక్స్ఛేంజ్‌లో నాపేరు రిజిష్టర్ చేయించి యిప్పటికి పన్నెండేళ్ళు. మంచి వుద్యోగం, చక్కటి జీతం లాంటి కలలు మానేసి నాలుగైదేళ్ళయింది. స్ట్రగుల్ ఫర్ సర్వైవల్....బతకాలి....బతకటమే జీవితం అయిపోయింది. అవకాశమున్న ప్రతి చిన్న, పెద్ద ఉద్యోగుల కోసం ఆశ పట్టం, ఆత్రుతపట్టం,దేవిరించటం కోసం అర్హమైనవాళ్ళనిఅన్నిరకాలుగా వాటికోసం అడుక్కోటం....కొన్నేళ్ళుగాయిదేబతుకు అయిపోయింది. చిన్నవీ పెద్దవీ పనులు దొరకవని కాదు.... దొరుకుతూనే వున్నాయి....చేస్తూనే వున్నాను. కానీ ప్రతిచోటా ఏదోరకం దరిద్రం..శ్రమ-దానికి తగిన జీతం అయితే ఎక్కడేనా యిమిడి పోయివుండేవాణ్ణి. కానీ అదికాదు పరిస్థితి మనం చేసే పనితోపాటు. మన కక్కుర్తి నంగిరి పింగిరితనం, తప్పుడు నవ్వులు, దొంగ వేషాలు యివీ కావాలి. అలావుండలేకపోతే ఎవరికీ మనం నచ్చం పైగా అందరికీ కోపం. ఏదోరకంగా యిబ్బందిపెట్టాలని చూట్టం.... హింసించాలని చూట్టం.


నన్ను పెంచిన తల్లి చచ్చిపోయింది. ఇప్పుడు నా మీద ఆధారపడ్డవాళ్ళు, బాధ్యతలు ఏమీలేవు.అందరిలాగే నా ముందూ వెనకా ఎవరేనా వుంటే పరిస్థితి వేరుగా వుండేదేమో. కానీ ఒంటరివాణ్ణి అందుకే అందరికీ తలొంచేసి వుండాలనిపించటం లేదు."

అతను కాస్సేపు ఆగాడు.

అంతవరకు అతను చెప్పినవి కొన్ని మాటలే అయినా అతనివేపే చూస్తూ కూచున్న సురేంద్రకి అతని కొన్నేళ్ళ జీవితం తెలియపరుస్తున్నట్టుంది అతని ముఖం. ప్రతిమాట వెనకా అతని పోరాటం, అసహనం, బాధ....తిరిగి అతను ఆరంభించాడు.

"డబ్బుయిబ్బందులు, అప్పులు, వస్తులు....అవమానాలూ యిదే కాదు సురేంద్రగారు నాబాధ....యిదివరకటిదా ఏది నిజం. ఏది అబద్ధం ఎవరు ఏమిటి.... అన్నది అర్థమయేది. ఈమధ్య కొన్నాళ్ళ నుంచిఅంతాఅయోమయంగానేవుంటోంది. అన్ని విషయాల్లోనూ సందేహమే. ఆఖరికి నాకు ఏది యిష్టమో, ఏది అయిష్టమో కూడా తెలియనంతకన్ఫ్యూజన్.... నాలాంటి వాళ్ళు యింకా చాలా మంది సద్దుకు బతికేయగలుగుతున్న జీవితం నాకే ఎందుకు యిబ్బందిగా బరువు తెలియని ప్రశ్నలా వుంటోందో అర్థంకాదు. అన్నింటికీ అసహనం, మనసులో, మెదళ్ళో. కళ్ళముందూ అంతా చిందర వందర.... చిరాకు .. సాదాగా. సాఫీగా ప్రవర్తించే గుణం వున్న నన్ను ఏదో శక్తి ఒకచోట బంధించినట్టు.... వూపిరాడని బాధ.... దీనికీ, ఆవిడ మీద నేను చేసిన ఆ అత్యాచారానికి ఏదో సంబంధం వుందని నాకనిపిస్తోంది. కానీ ఎటువంటి సంబంధమో సరిగ్గా అర్థంకావటంలేదు.

అంతకు ముందు రెండు రోజుల్నించీ నాకు సరైన భోజనం లేదు. ఆ రోజు పొద్దున్న ఓ పది రూపాయలు చేతికందాయి. హోటల్ కెళ్ళి కడుపునిండా భోంచేసి, వున్న చిన్న చిన్న అప్పులు తీర్చేసి రూమ్‌కొచ్చి పడుకున్నాను. నిద్రలేచేటప్పటికిమధ్యాహ్నంరెండైంది. వాతావరణం కొంచెం మబ్బు మబ్బుగా వుంది. చెయ్యటానికేం పనిలేదు. అలా

అని ఏ వనీ చెయ్యాల్సిన అవసరం లేదని కాదు. ఏదో దారి చూడకపోతే మళ్ళీ రాత్రికి వస్తు తప్పదు. రెండు రోజుల తర్వాత కడుపు నిండా తిన్నాక మళ్ళీ వస్తుంచే మహా యిబ్బంది. అందులో అదే రోజు ఉదయం ఒక ప్రపోజల్ ఎదురైంది. దొంగ సరుకున్న లారీతో పాటు నమ్మకమైన మనిషిగా కొంత దూరం వెళ్ళిరావాలి. యాభై రూపాయలు యిస్తారు. ఆ రోజేకాదు అలాంటి పనులు అంతకు ముందూ తగిలాయి. కానీ అంత వరకు చెయ్యలేదు. భయమని కాదు.... అయిష్టం. చిన్నప్పట్నించీ తప్పుడు పనులు చేసే అలవాటు లేని బలహీనత.

శ్రమలేని పని. నా జీవితంలో రిస్క్ అని భయపడాల్సిన అవసరం లేదు. అయినా ఎందుకో మనసు మొగ్గదు. నాకే కాదు, నాలాంటి యింకా ఎందరి జీవిత స్థాయినో తగ్గించే పనులవి అన్న అభిప్రాయం. అలా అని యాభై రూపాయల అవసరం,దాని సౌఖ్యం అంత తేలిగ్గా వొదులుకో గలిగిన బతుకూ కాదు.ఇలాంటి పనులు ఎదురైనప్పుడు ప్రతిసారీ యిదే నరకం. అప్పటిదాకా నిలబడుతూనే వున్నా. ఎప్పుడు పడిపోతానో అన్న జంకు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నప్పుడు నా ఆలోచన మధ్యకి వచ్చినట్టు ఆవిడ గుమ్మంలోకి వచ్చింది.

అప్పుడే నిద్ర లేచినట్టుంది ఆవిడాను.

కొద్దికొద్దిగా నలిగిన బట్టలు, వొంటి నిండా బద్ధకం. కళ్ళల్లో సుఖనిద్ర తాలూకు మత్తు. ఎందుకో ఒకటి రెండు క్షణాలు ఎప్పటికన్నా ఎక్కువగానే చూశాను ఆవిడ వేపు.నా చూపులు చూసో ఎందుకో తెలియలేదుగానీ నవ్వింది. నవ్వి తల దించుకోలేదు.అలాగే నా వేపు చూస్తూ నిలబడింది. అలా అప్పుడప్పుడు పలకరింపుగా ఆవిడ నవ్వుతున్నట్టు చూట్టం కొత్తేం కాదు.

ఆవిడ లోపలికి వెళ్ళిపోతే బావుణ్ణనిపించింది నాకు. నా ఆలోచనకి, నా జీవితానికి అడ్డులా తోచింది. ఆ క్షణాన తల తిప్పుకోలేక ఆ వి డ వెళ్ళిపోయిందే అన్నట్లు అటువేపే చూస్తూ నిలబడ్డాను.

ఆవిడ లోపలికి వెళ్ళలేదు. వెళ్ళాల్సిన అవసరం ఏం లేదన్నట్టు అక్కడే నిలబడింది. మరో క్షణం తర్వాత రెండు చేతులూ ఎత్తి గుమ్మం పట్టుకుని బద్ధకంగా మత్తుగా వొళ్ళు విరుచుకుంది.

ప్రతి కదలిక నాకు కనిపిస్తోనే వుంది. తృప్తి. సౌఖ్యపు గర్వం....నిర్లక్ష్యం.... ఎదుటివాళ్ళ గొడవ ఏమాత్రం అక్కర్లేని జీవితం. అనుకుని వున్న రెండు మేడల మధ్య గోడ దాటడం నాకు కష్టం కాలేదు. ఆవిడవేపే వస్తున్న నన్ను ఆశ్చర్యంగా చూస్తూనే వుంది. కానీ భయపడ లేదు.

నా కన్నా నాలుగైదేళ్ల వయసు తక్కువున్న ఆవిడ శరీరాన్ని నేను రెండు చేతుల్లో పట్టుకుని గదిలోకి తీసికెళ్ళినప్పుడూ ఆవిడ కొద్దిగా కంగారుపట్టం తప్ప ధీమాగానే వుంది.

ఆవిడ అయిష్టం, పెనుగులాటా తెలుస్తూనే వుంది. అదే సమయంలో ఆవిడ నన్ను బతిమలాట్టం లేదు. ప్రాధేయపట్టం లేదన్నదీ తెలుస్తూనే వుంది. వుద్రేకమో, కసో, ప్రతి మనిషిలోనూ అదను కోసం కాచుక్కూచునే జంతు ప్రవృత్తో నాకు తెలియదు. మొత్తానికి చాలా దారు



ఙంగా ఆవిష్ణి అనుభవించాను....” అన్నాడు.

ఆ తర్వాత కాస్సేపు యిద్దరూ ఏం మాట్లాడుకోలేని నిశ్శబ్దంలో గడిపారు.

అతను చెప్పిన సంఘటనతోటే విషయము ఆగిపోలేదు. అదే రోజు రాత్రి ఆవిడ ఆత్మహత్యచేసుకుంది. ఆత్మహత్య చేసుకునే ముందు ఆవిడరాసిన వుత్తరాన్ని యించుమించు పత్రికలన్నీ యదాతథంగా ప్రచురించాయి. ఆ వుత్తరంలోని కొన్ని వాక్యాలు సురేంద్రకి బాగా గుర్తున్నాయి.

'పక్కమేడమీద చాలా తరచుగా కనిపించే అతనివల్ల నా కింత ప్రమాదం వుంటుందని కానీ, ఎంతో సౌమ్యుడిలా కనిపించే అతనిలో యింత క్రౌర్యం వుందని కానీ నేను ఎప్పుడూ అనుకోలేదు. అతను మేడదాటి వచ్చేటప్పుడు ఎవరో ఒకరు చూసే అవకాశం లేక పోలేదు. నా మీద జరిగిన ఈ అత్యాచారం దాచుకోవాలన్నా దాగే అవకాశం లేనంతగా, మరిచిపోవాలన్నా మరచిపోయే వీలులేనంతగా గీట్లు, రక్కులు, కొరుకులు గుర్తులతో చేశాడు. అందుకే ఏదో జంతువు పీకిపీకి వదిలేసినట్టు మిగిలిన నా శరీరాన్ని నా భర్తకి చూపించలేక, తప్పనిసరై అందమైన నా జీవితాన్ని, నేను మరింత ఆనందంగా మలచుకోగలనన్న ధీమాతో యింతవరకూ గడిపిన జీవితాన్ని అంతం చేసుకుంటున్నాను....' ఆవిడ రాసిన ఆ వుత్తరంలో అప్పటిఆమెమానసిక పరిస్థితే కాదు, ఆవిడ నిస్సహాయత. ఆ సంఘటనలో అతని వికృత రాక్షసప్రవృత్తి అన్నీ కళ్ళకు కట్టినట్టున్నాయి. ఆ వుత్తరం చదివిన ప్రతివ్యక్తి అతన్ని అసహ్యించుకోక మానరు.

ఆ వ్యక్తే యిప్పుడు ఎదురుగా వున్నాడు. జరిగిన విషయం చెప్పుకుంటున్నాడు. కానీ ఆ వుత్తరంలోని రాక్షసుడికి, ఎదురుగావున్న ఈ సౌమ్యుడికి పొంతనెక్కడ? పరస్పరం భిన్నమైన ప్రవర్తనకి కారణం ఏమిటి?...సురేంద్ర నెమ్మదిగా మాటల్ని వూహలో పోగేసుకుని మరికాస్సేపటికి అడిగాడు.

"మీరింతచెప్పినా నాలోని సందేహం అలాగే వుండిపోయింది. ఆ సమయంలో మీలో అంత క్రూరత్వం ఎలా వచ్చింది? ఆడదాని శరీరపు అనుభవం మీకు అంతకు ముందు లేదా? ఆడవాళ్ళన్నా, వాళ్ళ శరీరమన్నా మీకేమైనా కసా? పైగా వో ఆడదాన్ని పొందటానికి యింత భీభత్సమా? మామూలుగా ఆ అనుభవాన్ని పొందే అవకాశం వుండీ ఎందుకిలా?"

"నాకు ఆడ అనుభవం లేదనికాదు సురేంద్రగారు....గతంలో కొన్నిసార్లు ఈ ఆడ అనుభవాన్ని కొనుక్కుని పొందాను. అక్కడా నా ధోరణి నాదే. అన్నీ తెలిసే వెడతారు. అనుభవించి వచ్చేస్తారు. కానీ నాకు అంత తేలిగ్గాలేదు ఆ అనుభవం. పైగా యిబ్బంది. ఆ ఆడవాళ్ళు నాతో వున్నప్పుడు వాళ్లేదో అయిష్టమైన అండర్‌పెయిడ్ జాబ్ చేస్తున్న వాళ్ళలా కనిపించారు. ఏదో తప్పించుకోవాలన్న బాధ....తప్పించుకోలేని బానిసత్వం.... ముడుచుకుపోయిన వాళ్ళ మనసులు....యింత మన కక్కుర్తి కొద్దిసేపట్లో ఏదో పొందేయాలన్న తాపత్రయం, సుఖంకోసం యిద్దరూకలిసి పడుకున్న ఆ సమయంలోనే డబ్బు లెఖ్ఖలూ,.... ఎప్పుడూ నాకా అనుభవం తృప్తినివ్వలేదు. అవసరం తీరటం, అంతవరకే.... అదేనా ఆ యిష్టం గా ఏమిటో అసహజంగా.

ఇంక ఆడవాళ్ళంటే నాకేం కసిలేదు. ముఖ్యంగా ఆవిడంటే ఎప్పుడూ ఆరాధనగానే చూశాను. ఇంక ఈ అనుభవాన్ని సవ్యంగా పొందే అవకాశం వుండీ ఎందుకింత భీభత్సం అన్నారు .... నిజమే సవ్యంగా పొందే అవకాశం లేకపోలేదు. .... అయినా ఎందుకిలా చేశాను. ఏ కారణం నాకూ కనిపించలేదు....కానీ ఈమధ్య ఒక విషయం ఫీలవుతున్నాను. ఏదో అస్థిమితం.... ఆక్రోశం.... చుట్టూ వున్న స్తబ్దతని భరించలేని అసహనం.... ఏదో బద్దలుకొట్టాలి అన్న ఇంపల్స్ ... ఐమేబి సిక్.... నాలో చిందర వందరకి అస్తవ్యస్తానికి ప్రతిబింబంగా మరోదాన్ని దేన్నో చిందరవందర చేసెయ్యాలి. ఆవిడ ఆ రోజు గింజుకుంటూ నన్ను నిరోధిస్తుంటే, అనిష్టంగా ఏదో శక్తిని లొంగదీసుకుంటున్నట్టు నా బలాన్నంతా వుపయోగించాను. ఆవిడ వొంటిమీద ఒక్కో గుర్తు నా బలాన్ని మరింత పెంచింది. అదో సాడిస్టిక్ టెంపర్‌మెంట్....ఇక్కడ ఈ సంఘటనలోనే కాదు.... నాకు చాలచోట్ల, చాలా ఆలోచనల్లో యిది కనబడింది. ఇంత మంది జనాభా, యింత విస్తారమైన నేల.... యింధన శక్తి....ఎన్నో రిసోర్సెస్‌వున్న ఈదేశం యిలా ఎందుకుండాలి?సత్యంగా సజావుగా ఎందుకుండ కూడదూ? నా అసవ్యానికి అదే కారణమేమో....నా అస్థిమితానికి నాకు జవాబు దొరకటంలేదు....ప్రశ్నలే దొలుకుతున్నాయి...." అన్నాడు అతను.

ఆ తర్వాత కొంతసేపు అతనితో గడిపినా, ఇంక అతన్ని అడగటానికి జవాబు దొరికే ప్రశ్నలేం కనిపించలేదు సురేంద్రకి.

